క్లుప్తంగా

రహదారిపై గోతులతో అవస్థలు



నేషనల్ స్కూల్ వద్ద రోడ్డులో ఏర్పడ్డ గోతులు

విజయనగరం ఫోర్ట్: నగరంలోని అయ్యన్నపేట నుంచి పాల్‌నగర్ మీదుగా విజయనగరం వెళ్లే రోడ్డులో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణం నరకాన్ని తలపిస్తుందని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

సమగ్ర సంక్షేమ చట్టం అమలు చేయాలి

విజయనగరం ఫూల్‌బాగ్: వంట గ్యాస్ సరఫరా చేస్తున్న డెలివరీ బాయ్స్ నేటి వరకు ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా ఎలాంటి సంక్షేమానికి నోచుకోలేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు. విజయనగరం జిల్లా కాల్ గ్యాస్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో విశాఖలో జరగబోయే ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాల కరపత్రాల ప్రచార కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అనంతరం బుగత అశోక్ మాట్లాడుతూ కరోనా లాంటి భయంకరమైన విపత్తులో సైతం డెలివరీ బాయ్స్ ఆరోగ్యాలను ఫణంగా పెట్టి వినియోగదారులకి వంట గ్యాస్ సిలిండర్లను సరఫరా చేశారని అన్నారు. సెప్టెంబర్ 3 వ తేదీన జరగబోయే భారీ ర్యాలీ, బహిరంగ సభలో కూడా పాల్గొంటామని తెలిపారు. కార్యక్రమంలో కృష్ణా, పైడిరాజు, హనుమంతు, అచ్యుత్ రావు, మూర్తి , డెలివరీ బాయ్స్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



శిబిరంలో తనిఖీలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నెల్లిమర్ల: నగర పంచాయతీలో ఉచిత కార్డియాలజీ వైద్య శిబిరం మంగళవారం జరిగింది. స్థానిక 7వ వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ ఆధ్వర్యంలో విశాఖపట్నం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వారు ఉచిత కార్డియాలజీ వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో కిమ్స్ ఐకాన్ వైద్యులు డాక్టర్ ఎస్‌వి.ప్రసాద్, 40 మంది రోగులకు బీపీ, సుగర్, ఈసీజీ, పరీక్షలు నిర్వహించి, ముగ్గురు రోగులను ఆస్పత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కుప్పనాయుడు జీవితం స్ఫూర్తిదాయకం



కుప్పనాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: వ్యవసాయ కార్మికులు, గిరిజనుల కోసం జీవితాన్ని అంకితం చేసిన కుప్పానాయుడు జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం అని సీపీఎం జిల్లా కమిటీ మాజీ సభ్యుడు ఎం.శ్రీనివాస్ అన్నారు. కుప్పన్నాయుడు వర్ధంతి సందర్భంగా స్థానిక ఎల్‌బీజీ భవనంలో కుప్పనాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించి, డాక్టరేట్ పొందిన ఆయన గిరిజనులు, వ్యవసాయ కార్మికుల కోసం నిరంతరం పని చేశారన్నారు. సీపీఎం నాయకులు రెడ్డి శంకరరావు, ఎ.జగన్‌మోహన్‌రావు, కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో టెండర్ల ప్రక్రియ



రామతీర్థంలో వేలం పాటను నిర్వహిస్తున్న దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో మంగళవారం టెండర్ల ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్కింగ్ నిమిత్తం కోరాడపేట గ్రామానికి చెందిన గేదెల తవుడు రూ.4.70 లక్షలకు టెండర్ వేసి దక్కించుకున్నారన్నారు. స్వామివారి ప్రసాదాలు, అన్నప్రసాదాల తయారీకి అవసరమైన రసవర్గాల పంపిణీకి శ్రీకాకుళానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తక్కువ ధరకు కోట్ చేసి టెండర్ దక్కించుకున్నారని చెప్పారు. కొబ్బరి ముక్కలు, తలనీలాలు, కూరగాయలకు సంబంధించి వేలం పాటను వాయిదా వేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పశు సంచారం



కోట జంక్షన్‌లో ప్రధాన రహదారిపై తిష్ట వేసిన పశువులు

- ప్రధాన రహదారులపై మూకుమ్మడిగా సంచారం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, వాహనచోదకులు
- చర్యలు తీసుకోవటంలో నిర్లక్ష్యం

విజయనగరం: సాధారణంగా రహదారులపై ఎక్కడైనా డివైడర్లుంటాయి. వ్యాపారధోరణితో ఆలోచించే పాలకులు, అధికారులుంటే ప్రచారబోర్డులు కనిపిస్తుంటాయి. కానీ జిల్లా కేంద్రంలో వీటితో పాటు పశువులు కూడా ఎక్కువగా ఉంటున్నాయి. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే నగరంలోని ప్రధాన జంక్షన్‌లలో ఈ పశుసంచారం కనిపిస్తూ ఉంటుంది. వీటివల్ల వాహనదారులకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. నియంత్రించేందుకు చర్యలు చేపట్టాల్సిన అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు.

కానరాని చర్యలు

పశుపోషణకు అవసరమైన మేతను ఇవ్వలేక కొందరు పశువులను వదిలేస్తున్నారు. దీంతో అవి ఆహారం కోసం రోడ్లపైకి చేరుతున్నాయి. రోడ్ల పక్కన కనిపించే చెత్తచెదారం మేస్తూ అక్కడే రోడ్లపైనే ఉంటున్నాయి. ఒక్కోసారి ఎటుపడితే అటు పరిగెత్తడం, రోడ్లపైనే ఉండిపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. పశువులను నియంత్రించాలని, సమస్యను పరిష్కరించాలని స్థానికులు ఫిర్యాదు చేసినా స్పందన కనిపించడం లేదు. రహదారులపై పశువులను స్వేచ్ఛగా వదిలేయొద్దని, అలాంటి వ్యక్తులకు నోటీసులు జారీచేసి పశువులను గోశాలకు తరలిస్తామని కార్పొరేషన్ అధికారులు తరచూ ప్రకటిస్తున్నారు. ఇదంతా ప్రకటనలకే పరిమితమవుతోందే తప్ప క్షేత్ర స్థాయిలో కఠినంగా వ్యవహరించడం లేదు. దీంతో పశువుల యజమానులు సైతం ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. ఎవరికేం జరిగితే మాకేంటన్న నిర్లక్ష్యంతో పశువులను వదిలేస్తున్నారు.

ప్రధాన రహదారిపైనే...

జిల్లా కేంద్రంలోని కోట జంక్షన్ వద్ద ప్రధాన రహదారిపైనే ఎక్కడికక్కడే పశువులు ఎక్కడికక్కడ సంచరిస్తూ వాహన చోదకులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. చిన్నపాటి వీధుల్లో పరిస్థితి ఎలా ఉన్నా ప్రధాన రహదారులపై వాహనాల రాకపోకలు ఎలా ఉంటాయో తెలియంది కాదు. దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు వేగంతో వెళ్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇలా రోడ్లపై పశువులు ఇష్టారీతిన తిరిగితే వాహనదారులకు ఎంత ప్రమాదకరమో అర్థమవుతుంది. ఇది కేవలం ఉదాహరణ మాత్రమే. జిల్లాకేంద్రంలో చాలాచోట్ల ఈ తరహా పరిస్థితి కనిపిస్తోంది.

హెచ్చరికలకే పరిమితమవుతూ..

ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే సంబంధిత అధికారులు అడ్డుకోవాలి. నివారణపై దృష్టి సారించాలి. కానీ, వారూ అదే వైఖరి అవలంబిస్తే ఇక ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులు వర్ణనాతీతం. దానికి నిదర్శనమే జిల్లా కేంద్రంలో పశుసంచారం వ్యవహారం. చూసేందుకు, వినేందుకు చిన్న విషయంలాగే అనిపించినా.. దీనివల్ల కలిగే అనర్థాలతో దెబ్బతిన్నవారికి అదెంత తీవ్రమైనదో అవగతమవుతోంది. ఎప్పటికప్పుడు బాధ్యులపై చర్యలు తీసుకుంటామంటూ ఆర్భాటంగా హెచ్చరిస్తున్న అధికారులు ప్రకటనలకే పరిమితమవుతుండటంతో పరిస్థితిలో మార్పు రావడం లేదు. ఎప్పుడైనా హెచ్చరిస్తే నాలుగైదు రోజులు పరిస్థితిలో మార్పు కనిపిస్తున్నా.. తర్వాత ఎప్పటిలాగే కొనసాగుతోంది.

చర్యలు తీసుకుంటాం

రహదారులపై పశువులను ఇష్టారీతిన వదిలేయడం సరికాదు. యజమానులు స్పందించి వెంటనే వాటిని నియంత్రించాలి. లేకపోతే కార్పొరేషన్ ఆధ్వర్యంలో వాటిని తొలగింపజేస్తాం. గోశాలలకు తరలిస్తాం.

– ఎం.మల్లయ్యనాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్.

ప్రమాదాలకు ఆస్కారమిస్తూ..

ఉదయం, రాత్రి తేడా లేకుండా పశువులు రహదార్లపై సంచరిస్తుండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తులు పశువులను గుర్తించలేక అదుపుతప్పి కిందపడటంతో గాయపడ్డారు. ఇలాంటి సంఘటనలు తరచూ ఎక్కడో చోట జరుగుతూనే ఉన్నాయి. దీనికితోడు పట్టణంలోని వివిధ మార్గాల్లో రహదార్లపై ఉన్న వీధిదీపాలు, సెంట్రలైటింగ్ సైతం సక్రమంగా పనిచేయడం లేదు. ఫలితంగా రాత్రివేళల్లో ప్రయాణించే వారు రోడ్లపై ఉన్న పశువులను గుర్తించలేకపోతున్నారు. చాలామంది వాహనదారులు వాటిని తప్పించే క్రమంలో అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు.

వైద్య శిబిరానికి స్పందన



శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ మామిడి అప్పలనాయుడు

విజయనగరం: మండలంలోని గుంకలాం గ్రామంలో సీతారాం ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ, ఎస్‌వీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. షుగర్, బీపీ, జ్వరము, దంత సమస్యలు, గైనిక్, దీర్ఘకాల వ్యాధులకు ప్రముఖ వైద్యులు సేవలు అందించి సలహాలు ఇచ్చారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజయనగరం మండల పరిషత్ అధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు, గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఉచిత వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు జి.అనిల్‌కుమార్, టి.శిరీష, టి.సుధీర్, ఎం.నవ్యశృతి, వి.మనోజ్ తదితరులు వైద్య సేవలు అందించారు. శిబిరంలో 200 మందికి పైగా రోగులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగంపై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న ఏవో హరికృష్ణ

భోగాపురం: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వ్యవసాయ శాఖ, రెవెన్యూ సిబ్బందికి తహసీల్దార్ సురేష్, మండల వ్యవసాయ శాఖ అధికారి హరికృష్ణ పంటకోత ప్రయోగంపై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో వారు మాట్లాడుతూ పంటకోత ప్రయోగం వలన చాలా లాభాలు ఉన్నాయన్నారు. మండలంలో ప్రతి సంవత్సరం పంటకోత ప్రయోగం వలన మండలం యొక్క మొత్తం పంటల ఉత్పాదకతను తెలుసుకోచ్చునని తెలిపారు. పంటల యొక్క దిగుబడి తగ్గినప్పుడు ఆ క్లస్టర్‌లో ఉన్న పంటలకు ప్రభుత్వం ద్వారా ఇన్సూరెన్స్ పొందడమే కాకుండా ధాన్యం కొనుగోలు సమయంలో దిగుబడిని అంచనా వేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారి జోత్స్న, ఏఎస్ఓ చరణ్‌ప్రసాద్, వీపీఏలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించాలి

- ఏఐటీయూసీ నాయకుడు అశోక్



ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు, సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్లకు ప్రతి నెల సకాలంలో జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ నాయకుడు బుగత అశోక్ డిమాండ్ చేసారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత మూడు నెలలుగా దశల వారీగా వేతనం కోసం, ఉద్యోగ భద్రత కోసం ఉద్యమాలు చేస్తున్నప్పటికీ, ఆస్పత్రికి వచ్చిన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కల్గించకుండా సేవలు అందించినప్పటికీ అధికారులకు కనీసం వర్కర్ల పట్ల కనికరం లేదని ఆరోపించారు. శ్రమకి తగిన జీతం లేక ప్రతి నెల జీతాలు రాకపోవడం వల్ల ధరల భారాలను తట్టుకోలేక అప్పులు పాలవుతున్నారన్నారు. వడ్డీ వ్యాపారుల చేతుల్లో చిక్కి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. కార్మికుల కష్టార్జితంలో దాచుకున్న పీఎఫ్ డబ్బులు కూడా దోచుకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో అప్పారావు, గణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హుద్‌హుద్ ఇళ్లకు కరెంట్ ఇవ్వాలి



హౌసింగ్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బాధితులు

విజయనగరం ఫూల్‌బాగ్: విజయనగరంలోని హుద్‌హుద్ బాధితులకు లంకా పట్టణంలో నిర్మించిన ఇళ్లకి మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం పార్టీ నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. హౌసింగ్ కార్యాలయం వద్ద సీపీఎం అధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న హుద్‌హుద్ బాధితులకు ఇళ్లను అప్పచెప్పడం లేదన్నారు. చివరికి సీపీఎం 2023 నవంబర్‌లో 290 మందిని ఆ ఇళ్లల్లో దించిందని, కానీ నివాసంలో ఉన్న వారికి కరెంట్, మంచినీరు, మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్నారు. ఇప్పటికైనా కరెంట్ మీటర్లు ఇచ్చి, కరెంట్ వైర్లు రిపేరు చేసి ఇళ్లను అధికారికంగా వెంటనే అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. హరీష్, శ్రీనివాస రావు, రమణమ్మ, రాము తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై కలెక్టర్‌కు నివేదిక అందిస్తాం..



తెర్లాం: తమ్మయ్యవలసలో పీఎం జన్‌మన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ



బొబ్బిలి రూరల్: గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

- పీఎం జన్‌మన్ కార్యక్రమంలో ఎంపీడీవో శంబంగి రామకృష్ణ

తెర్లాం: ఆదివాసీ కాలనీల్లోని తాగునీరు, రోడ్డు సమస్యల పరిష్కారంపై కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ తెలిపారు. మండలంలోని తమ్మయ్యవలస గ్రామంలో పీఎం జన్‌మన్(ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్) కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి గ్రామంలోని ఆదివాసీ కుటుంబాలు, వారి జీవన స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పీఎం జన్‌ధన్ ఖాతాలు అందరికీ ఉన్నాయా, లేదా అని ప్రశ్నించారు. ఎంపీడీవో మాట్లాడుతూ కాలనీలో రోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రతిపాదనలు తయారు చేసి, కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామన్నారు. ప్రతి ఒక్కరితో జన్‌ధన్ ఖాతాలు తెరిపించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో మంగళవారం నుంచి సెప్టెంబరు 10వ తేదీ వరకు ప్రతిరోజూ రోజుకు ఒక శాఖ తరపున అందిస్తున్న పథకాలు, కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. గ్రామంలోని ఆదివాసీ కుటుంబాల వారంతా ప్రతీ పథకంపైనా, శాఖపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీవో కె.రాజ్యలక్ష్మి, తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి, పంచాయతీ ఈవో సూరిబాబు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి..

బొబ్బిలి రూరల్: పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని దిబ్బగుడ్డివలస పంచాయతీలోని రాచేరువలస గ్రామంలో అధికారులు మంగళవారం పర్యటించి, గ్రామసభ నిర్వహించారు. గ్రామస్తులంతా అధికారులను కలిసి గ్రామంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అభ్యర్థించారు. సీసీ రోడ్లు వేయాలని, పక్కా ఇళ్లు మంజూరు చేయాలని, వైద్య సదుపాయం అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. తహసీల్దారు శ్రీను, ఎంపీడీవో రవికుమార్‌లు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికే తాము వచ్చామని, ప్రజా సమస్యల పరిష్కారంపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతల రామారావు, పంచాయతీ కార్యదర్శి ఉడముల వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణతత్వం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

- డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



విజయనగరం: శ్రీకృష్ణునికి పంచామృత అభిషేకాలు



విజయనగరం టౌన్: డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణిని సత్కరిస్తున్న సమితి ప్రతినిధులు

విజయనగరం టౌన్: కృష్ణతత్వం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలంటే త్రైత సిద్ధాంత భగవద్గీత చదవాలని విజయనగరం మున్సిపాలిటీ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి తెలిపారు. శ్రీ ప్రబోధానంద యోగీశ్వరుల దివ్యాశీస్సులతో ప్రబోధా సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురజాడ కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలో రెండోరోజు మంగళవారం ఆమె పాల్గొన్నారు. ఈ సంద్భంగా ఆమె మాట్లాడుతూ ఆధ్యాత్మిక జీవనంలో ప్రతి ఒక్కరూ నడవాలంటే భగవద్గీత పఠనం చేయాలన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రావణిని సమితి సభ్యులు సత్కరించారు. ఇందూ జ్ఞానవేదిక అధ్యక్షుడు వానపల్లి శంకరరావు, సభ్యులు సీవీఎస్ నాయుడు, ప్రసాద్, ఆదినారాయణ పాల్గొన్నారు.

కృష్ణుని అవతారంలో శ్రీనివాసుడు

శ్రీకృష్ణ భగవానుడి జన్మాష్టమి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో కొలువైన శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని కృష్ణుని అవతారంలో ఆలయ అర్చకులు పీవీ నరసింహాచార్యులు సర్వాంగ సుందరంగా అలంకరణ చేశారు. అరుంధతీనగర్ కాలనీలో ఉన్న శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి వారు శ్రీకృష్ణుని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కోలాట ప్రదర్శనలు నిర్వహించారు.

శ్రీకృష్ణునికి పంచామృత అభిషేకాలు

విజయనగరం: ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణంలో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం ఉదయం వేదమంత్రాలు నడుమ అర్చకులు చాణక్య ,శ్రీ హర్ష ,తేజ శ్రీకృష్ణునికి పంచామృత అభిషేకాలు గావించారు. భక్తులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణుని అవతారంలో టీటీడీ ఆవరణలో కొలువైన వేంటేశ్వరస్వామి

ముగిసిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని జోగిరాజుపేట, దన్నానపేట గ్రామాల్లో గడిచిన రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు మంగళవారం వైభవంగా ముగిశాయి. జోగిరాజుపేట శివాలయంలో ఉట్టిని కొట్టే కార్యక్రమాన్ని గ్రామస్తులు, ఆలయ నిర్వాహకులు ఉత్సాహంగా నిర్వహించారు. దన్నానపేట శ్రీకృష్ణుడి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గేదెల రామచిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో..

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో వైష్ణవ సంప్రదాయం ప్రకారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉపాలయంలో కొలువుదీరిన శ్రీ వేణుగోపాలస్వామిని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలకరించారు. స్వామివారి ప్రతిమకు పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలతో అభిషేకాలు జరిపించారు. విశేష అర్చనలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు నరిసింహాచార్యులు, కిరణ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల రూరల్: జోగిరాజుపేట శివాలయం ఆవరణలో ఉట్టిని లాగుతున్న గ్రామ పెద్దలు

మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలి

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాలు వండి పెట్టాలని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని వండానపేట, చాటాయవలస, ఉప్పరనాయుడువలస తదితర గ్రామాల్లోని పాఠశాలలను మంగళవారం సందర్శించిన ఆయన అక్కడి పాఠశాలల రికార్డులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. వేడివేడిగా ఉన్నప్పుడే ఆహార పదార్థాలను విద్యార్థులకు వడ్డించాలని, కాచివడపోసిన నీటినే తాగేందుకు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వంగర: విద్యార్థుల విద్యాప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషి చేయాలని ఎంఈవో వై.దుర్గారావు సూచించారు. మండలంలోని నీలయ్యవలస గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన.. రికార్డుల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సీహెచ్ జయరాజ్, లెంక రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యాన్ని సద్వినియోగం చేసుకోండి



ఆయుర్వేద మందులు వాడకంపై అవగాహన కల్పిస్తున్న ఆయుర్వేద వైద్యాధికారి సునీల్‌కుమార్

రేగిడి: ఆయుర్వేద వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ కోరారు. మండలంలోని ఖండ్యాం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలని, ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధుల బారినపడకుండా ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

లంపీస్కిన్ వ్యాధి బారిన పశువులు



లంపీస్కిన్ వ్యాధి సోకిన లేగదూడలు

వంగర: మండలంలోని ఇరువాడ పంచాయతీ, చంద్రంపేట గ్రామంలోని పశువులు లంపీస్కిన్ వ్యాధి బారిన పడుతున్నాయి. గత 10 రోజులుగా పశువులకు ఈ వ్యాధి ఎక్కువైందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన తెర్లి జగ్గనాయుడు, అయ్యల స్వామియాజులు, లక్ష్మీనరసింహమూర్తి, పెద్దింటి వెంకటనాయుడు, వంగపండు వెంకటనాయుడు, నాగళ్ల లక్ష్ముంతో పాటు మరి కొంతమంది రైతులకు చెందిన పశువులు ఈ వ్యాధితో ప్రస్తుతం బాధపడుతున్నాయి. పశువుల శరీరంపై చిన్నపాటి పొక్కులు ఏర్పడి, అవి తర్వాత పుండ్లుగా మారుతున్నాయని సంబంధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పశు వైద్యసేవలు అంతగా అందడం లేదని, అధికారులు స్పందించి పశువైద్య సేవలందించాలని కోరుతున్నారు.